పూర్తిస్థాయి కమిటీ నియామకం



నియామక పత్రాలను అందుకుంటున్న కమిటీ సభ్యులు

లాలాపేట: తార్నాక డివిజన్ స్థాయి కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయి కమిటీని నియమించారు. ఆదివారం తార్నాక డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బ్రహ్మాజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షుడిగా మహేశ్‌కుమార్, పవన్‌కుమార్, సూర్యప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా అనీల్ కుమార్ గౌడ్, కార్యదర్శులుగా తిరుపతి లాల్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, కొండమ్ వెంకటేష్, లూథర్ లీ, అశోక్, మహ్మద్ అబ్దుల్ నయీమ్, సంయుక్త కార్యదర్శులుగా మోహన్, కృష్ణ, విశాల్, గోపాల్‌రావు, జగన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నర్సింగరావు, బాల్‌రాజు గౌడ్, కుమార్, నరేష్, ప్రదీప్, సంజీవ, కోశాధికారిగా రాజు నియమితులయ్యారు. దీనికి సంబంధించిన నియామకపు పత్రాలను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం



కేలండర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

లాలాపేట: కుమ్మర్లు ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందని కుమ్మర సహకార సంఘం అధ్యక్షులు ఉప్పలంచి రామకృష్ణ అన్నారు. ఈ మేరకు లాలాపేట కుమ్మర సహకార సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కేలండర్ ఆదివారం లాలాపేటలోని సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందాలంటే కుమ్మర కులస్తులంతా ఐక్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు, ఉపాధ్యక్షులు నాగయ్య, సలహాదారులు కుందన్‌పల్లి వెంకటేష్, సహాయ కార్యదర్శి మోహన్‌కుమార్, కోశాధికారి రాజశేఖర్, వెంకటేష్, అంజనేయులు, వీరన్న, వెంకటేష్, రాజరత్నం, ప్రసాద్ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న వక్తలు

సనత్‌నగర్: బేగంపేటలోని తాజ్‌వివంతా హోటల్‌లో ఆదివారం 'అన్‌బ్రేకబుల్ స్పిరిట్–నావిగేటింగ్ లైఫ్ విత్ ఎంఎస్' పుస్తకాన్ని పులువురు వక్తలు ఆవిష్కరించారు. మెదడు, వెన్నుపాము, నాడీ వ్యవస్థ, నరాల సంబంధిత సమస్య అయిన మల్టీపుల్ స్క్లెరోసిస్ (ఎంఎస్) సమస్యలపై అవగాహన కలిగించేలా రచయిత్రి, విద్యావేత్త ఫరీదారాజ్ రచించిన పుస్తకావిష్కరణలో సీఆర్‌పీఎఫ్ మాజీ డీజీపీ దుర్గాప్రసాద్, ఆసఫ్‌జాహీ రాజవంశం తొమ్మిదో అధిపతి రౌనక్ యార్‌ఖాన్, మల్టీపుల్ స్క్లెరోసిస్ సొసైటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు మీనాగుప్తా, వైద్య నిపుణులు డాక్టర్ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్టీపుల్ స్క్లెరోసిస్ సమస్యలపై అవగాహన లేక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి వారి ప్రయోజనం కోసం దేశంలోనే తొలిసారిగా ఈ పుస్తకాన్ని రచించిన ఫరీదారాజ్‌ను అభినందించారు.

కులగణనపై మాజీ డీజీపీ వ్యాఖ్యలు అర్థరహితం

ఉస్మానియా యూనివర్సిటీ: కుల గణన విదేశీ శక్తుల ఎజెండా అని ఏపీలో కులగణనపై మాజీ డీజీపీ అరవిందరావు చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో బీసీలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ కుల గణనకు శ్రీకారం చుట్టారన్నారు. కులగణను వ్యతిరేకిస్తూ వ్యాఖ్యానించడం దారుణమని సామాజిక న్యాయం, విద్య, ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ పథకాల పంపిణీ, రిజర్వేషన్ల పెంపు తదితర అంశాలకు కులగణన ఎంతో దోహదపడుతుందన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నత విద్యావంతులు కులగణనకు వ్యతిరేకంగా మాట్లాడటంవారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు.



బేగంపేట.. ట్రాఫిక్‌తో తంటా!

స్తంభిస్తున్న వాహనాలు, నత్తను తలపించేలా కదలిక

- నిత్యం వీవీఐపీలు, వీఐపీల రాకపోకలతో బందోబస్తులోనే పోలీసులు
- ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెడితేనే సమస్యకు పరిష్కారం

సనత్‌నగర్: బేగంపేట మార్గం వాహనాలు నడపాలంటే సాహసం చేయాల్సిన దుస్థితి నెలకొంటోంది. ఒక్కసారి ట్రాఫిక్‌లో చిక్కుకున్నామంటే కనీసం 45 నిమిషాలు ఆగాల్సి ఉంటుందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఎవరో ఒకరు వీవీఐపీ, వీఐపీలు ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తుంటారు. బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు రావడమో లేక ఇతరత్రా పనులపై ఈ రూట్‌ను ఎంచుకోవడంతో వాహనదారులు ట్రాఫిక్ దిగ్బంధంలో చిక్కుకుని విలవిల లాడుతున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి మొదలుకొని బేగంపేట వైట్‌హౌస్ వరకు ఆరు కిలోమీటర్ల దూరం ఉండగా ఆ గమ్యాన్ని చేరుకోవడానికి గంటకు పైగా సమయం పడుతుందంటే ట్రాఫిక్ ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఉదయం సాయంత్రం వేళల్లో ఇక్కడి పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని వాహనదారులు వాపోతున్నారు.

పెరుగుతోన్న వాహనాల ఒత్తిడి..

బేగంపేట మార్గంలో ప్రతిరోజూ వాహనాల ఒత్తిడి పెరుగుతూనే ఉంది. అటు సికింద్రాబాద్, ఇటు అమీర్‌పేట, పంజగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సోమాజిగూడ, రాజ్‌భవన్ రోడ్లను బేగంపేట రహదారి అనుసంధానంగా ఉంటుంది. ఈ క్రమంలో ప్రతినిత్యం వేలాదిగా రోడ్లపైకి వచ్చి చేరుతున్నాయి. అన్ని రహదారులకు ఈ రహదారి ప్రధానమైనది కావడంతో వాహనాల సంఖ్య అంతకంతకూ అధికమవుతోంది. దీంతో నిత్యం ఈ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు నిత్యం నరకం చవిచూడాల్సిందిఏ. సికింద్రాబాద్ నుంచి అమీర్‌పేట, పంజగుట్ట, బాలానగర్, బంజారాహిల్స్, సోమాజిగూడ, సనత్‌నగర్, ఎర్రగడ్డ, కూకట్‌పల్లి వంటి ముఖ్య ప్రాంతాలకు వెళ్లాలంటే ఇదొక్కటే ప్రధాన మార్గంగా ఉంది. వేరే ప్రత్యామ్నాయ దారి లేకపోవడం..ఉన్నా దూరభారంతో కూడుకున్నది కావడంతో ఈ రహదారిలో సాధారణంగానే ట్రాఫిక్ ప్రభావం ఉంటుంది. దీనికి తోడు బేగంపేట నందిని హోటల్, రసూల్‌పురా చౌరస్తాల వద్ద మెట్రో పిల్లర్లు రోడ్డు మధ్యలో రావడం కారణంగా ఆయా ప్రాంతాలు బాటిల్‌నెక్‌ను తలపిస్తున్నాయి. దీంతో అక్కడకు వచ్చేసరికి వాహనాలు నెమ్మదిగా సాగుతూ బారులుదీరుతాయి.

పోలీసులపై ఒత్తిడి..

బేగంపేట విమానాశ్రయానికి నిత్యం వీవీఐపీల రాకపోకలు కొనసాగుతూనే ఉంటాయి. ఆ సమయంలో వాహనాల రాకపోకలకు బ్రేక్ పడుతూనే ఉంటుంది. ఇక్కడి పోలీసులు కూడా ఎక్కువ శాతం బందోబస్తులోనే ఉండే పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి. నిత్యం బందోబస్తు డ్యూటీలతో ఇక్కడి పోలీసులు గడిపేస్తుండగా..ఇదెక్కడి గోల అంటూ ఇక్కడి నుంచి ఎప్పుడు బదిలీ అవుతామా? ఎదురు చూస్తున్నారంటూ ఇక్కడి పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. ఒకవైపు బందోబస్తు డ్యూటీ, మరోవైపు ట్రాఫిక్ డ్యూటీలతో ఇక్కడి పోలీసులు రోడ్ల మీదనే ఎక్కువగా గడుపుతుంటారు. పలు సందర్భాల్లో పోలీసులు సైతం ట్రాఫిక్‌ను నియంత్రించలేని పరిస్థితులు తలెత్తుంటాయి. ఈ క్రమంలో వారిపై విపరీతమైన ఒత్తిడి పెరుగుతోంది.

ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి ఏదీ..?

బేగంపేట మార్గంలోకి వచ్చిన వారి సహనానికి పరీక్ష ఉంటుంది. ముఖ్యంగా ప్యాట్నీ నుంచి సీఎం క్యాంప్ ఆఫీస్ వరకు వాహనాల వేగం సూచీ 20కు మించదంటే ట్రాఫిక్ ఎలా ఉంటుందో చెప్పనక్కర్లేదు. ఈ మార్గం పైనే ఆధారపడకుండా అనుబంధంగా ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిసారిస్తే తప్ప వాహనాల వేగం పెరగదని స్పష్టమవుతోంది. ముఖ్యంగా రసూల్‌పురా చౌరస్తా నుంచి పాటిగడ్డ, బ్రాహ్మణవాడీ మీదుగా నాలా పక్క నుంచి రోడ్డు నిర్మాణ ప్రతిపాదన ఉన్నప్పటికీ అది కాగితాలకే పరిమితమైంది. అలాగే బేగంపేట హెచ్‌పీఎస్ వద్ద నుంచి శ్యాంలాల్ బిల్డింగ్స్ మీదుగా ఇందిరాగాంధీపురం, ఫతేనగర్, బాలానగర్ మార్గంలో రోడ్డు నిర్మాణ పనుల ప్రతిపాదన చేశారు. కానీ ఇది ఇందిరాగాంధీపురం వద్ద నుంచి శ్మశానవాటిక వద్దకు రాగానే రోడ్డు నిలిచిపోయింది. ఈ ప్రాజెక్టులు కార్యాచరణలోకి వస్తే మాత్రం ఈ మార్గంలో కొంత మేరకైనా ట్రాఫిక్ సమస్య తీరుతుందని వాహనదారులు ఎదురు చూస్తున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు



జెక్‌కాలనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి

ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి

సనత్‌నగర్: ఎర్రగడ్డ సంతకు వచ్చేవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోందని, సనత్‌నగర్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులతో పాటు నివాసితులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాఫిక్ అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ నిగిడాల సురేష్, ఇతర సిబ్బందితో కలిసి వేణుగోపాల్‌రెడ్డి ఎర్రగడ్డ సంతను పర్యవేక్షించారు. అనంతరం జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. కోర్టు, మానవ హక్కుల కమిషన్ ఉత్తర్వుల మేరకు కమిషనర్ ఆదేశాలతో ఎర్రగడ్డ సంత వ్యాపారులను జెక్‌కాలనీలోకి రాకుండా నియంత్రించగలిగామన్నారు. ఎర్రగడ్డ సంకొచ్చే వచ్చే కొనుగోలు, విక్రయదారులతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని వాహనదారులతో పాటు సనత్‌నగర్ నివాసిత ప్రాంత ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సనత్‌నగర్ ప్రధాన మార్గంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించి నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు చెప్పారు.సంతకు తాము వ్యతిరేకం కాదని, ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేయాలన్నదే తమ అభిప్రాయమని జెక్‌కాలనీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెక్‌కాలనీ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, రాజశేఖర్‌చందు, ప్రతినిధులు అనంతరెడ్డి, విశ్వనాథరాజు, కంజర్ల సదాశివయాదవ్, సోమ వెంకట్, పూర్మానీ మల్లారెడ్డి, నాగిరెడ్డి, రాజా, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

రాంగోపాల్‌పేట్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు సంకల్ప్ పథకంలో భాగంగా ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ప్రాజెక్టు సమన్వయకర్త విజయలక్ష్మి తెలిపారు. దివ్యాంగులకు హాస్టల్ వసతితో పాటు ఉపాధి హామీతో కూడిన శిక్షణ కొనసాగుతుందన్నారు. బేగంపేటలో ఈ శిక్షణ ఉంటుందని, శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామని ఆసక్తి ఉన్న వారు 9618002807, 8179175768 నంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రజావేదికను సద్వినియోగం చేసుకోవాలి

చిలకలగూడ: ప్రజా సమస్యల పరిష్కారం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజావేదిక కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ కోరారు. సోమవారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు మారేడుపల్లిలోని జోనల్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, బేగంపేట, ముషీరాబాద్ జోన్‌ల పరిధిలోని ప్రజా, వ్యక్తిగత సమస్యలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో కొన్ని సమస్యలను అక్కడికక్కడే, మిగిలినవాటిని ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామన్నారు. అన్ని విభాగాలకు చెందిన సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు.

నియామకం



వరికుప్పల రవి

లాలాపేట: సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన వరికుప్పల రవి నియమిస్తూ ఇటీవల డీసీసీ అధ్యక్షులు ఎం. అనీల్‌కుమార్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ..రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు.

కృష్ణ చైతన్యకు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) విభాగంలో ఎన్.కృష్ణ చైతన్యకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ఎంజీఐటీ ప్రొఫెసర్ సీఆర్‌కే రెడ్డి పర్యవేక్షణలో రి యూజబుల్ కాంపొనెంట్ రిట్రీవల్ ఫ్రం ఆప్టిమైజ్డ్ రేపాజిటరీ యూజింగ్ న్యూరల్ నెట్వర్క్స్ అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ పొందారు. కరీంనగర్ జిల్లా కోహెడ మండలం శనిగారం గ్రామానికి చెందిన కృష్ణ చైతన్య బాచుపల్లిలోని గోకరాజు రంగరాజు కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులుగా పని చేస్తున్నారు.

తెలిసినా మౌనంగా ఉంటారు..
ఫిర్యాదు చేస్తేనే కూల్చివేస్తారు!

- తార్నాకలో యథేచ్ఛగా అనుమతికి మించి నిర్మాణాలు
- కిందిస్థాయి అధికారుల నిర్వాకంతో బల్దియా ఆదాయానికి గండి

లాలాపేట: టౌన్‌ప్లానింగ్ కిందిస్థాయి అధికారులు, సిబ్బంది నిర్వాకంతో సామన్య ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. సాధారణంగా ఇళ్లు, భవనాలు నిర్మాణాలు చేపట్టాలంటే కొన్ని నియమ నిబంధనలతో అధికారులు అనుమతులు ఇస్తారు. అయితే కొందరు వ్యక్తులు అనుమతులకు మించి అదనపు అంతస్తుల నిర్మాణాలు చేపడుతుంటారు. అలాంటి సమయంలో సంబంధిత అధికారులు తామిచ్చిన అనుమతుల మేరకే నిర్మాణం చేపట్టారా.. లేక నిబంధనలు ఉల్లంఘించారా అనే వాటిపై వివరాలు సేకరించాలి. ఒకవేళ అనుమతులకు మించి నిర్మాణాలు చేపడితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని కూల్చివేయాలి. కానీ.. తార్నాకలో మాత్రం నిబంధనలు ఉల్లంఘించినట్టు తెలిసి కూడా టౌన్‌ప్లానింగ్ కిందిస్థాయి సిబ్బంది మౌనంగా ఉంటున్నారు. వాటిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప స్వతహాగా చర్యలు చేపట్టేందుకు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో అర్థం కావడం లేదని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు. ఫిర్యాదు వస్తేనే కూల్చివేస్తామని టౌన్‌ప్లానింగ్ అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉంది. అధికారులు నిర్వహించాల్సిన విధులను ప్రజలు(ఫిర్యాదుదారులపై) నెపం వేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఇటీవల తార్నాకలో చేపట్టిన పెంట్‌హౌజ్‌ను కూల్చివేసిన దృశ్యం

ప్రతి భవనంపై పెంట్ హౌజ్..

తార్నాక స్ట్రీట్ నెంబర్–2 లో ఉన్న ప్రొఫెసర్ నున్నాస్ ఫ్రెడ్ ఐదంతస్తుల భవనంపై అనుమతి లేకుండా సదరు బిల్డర్ పెంట్ హౌజ్‌ను నిర్మాణం చేశారు. భవన నిర్మాణం పూర్తయి దాదాపు రెండేళ్లకు పైగా కావస్తోంది. ఇటీవల ఆ అపార్టుమెంట్ వాసుల్లో నెలకొన్న వివాదంతో అనాధికారింగా నిర్మాణం చేసిన పెంట్‌హౌజ్‌పై ఫిర్యాదు చేశారు.రెండేళ్లుగా మౌనంగా ఉన్నా అధికారులు ఇప్పుడు హుటాహుటిన అక్కడికి వెళ్లి పెంట్ హౌజ్‌కు తూతూమంత్రంగా కూల్చి మమ అనిపించారు. తార్నాక ప్రాంతంలో దాదాపు అన్ని బహుళ అంతస్తుల అపార్టుమెంట్‌లే దర్శనం ఇస్తాయి. ప్రతి అపార్టుమెంట్‌పై దాదాపు కచ్చితంగా పెంట్ హౌజ్ కనిపిస్తుంది. మరి వీటన్నింటికి టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతి ఇచ్చారా అని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదు వస్తేనే స్పందిస్తారా అని అడుగుతున్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాల్సిన అధికారులు, సిబ్బందికి తార్నాకలో అడగడుగునా ఉన్న పెంట్ హౌజ్‌ల మాటేమిటని ప్రశ్నిస్తున్నారు.

అనుమతి ఒకదానికి.. నిర్వహణ మరొకటి..

తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొందరు భవన నిర్మాణదారులు ఇంటి నిర్మాణం సమయంలో నివాస భవనంగా జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతులు తీసుకుంటున్నారు. భవన నిర్మాణం పూర్తయి కొంత కాలం తర్వాత అదే భవనం కింది భాగాన్ని కమర్షియల్‌గా మార్చేస్తారు. మరి కొందరు స్లమ్స్‌లో జీ ప్లస్ 2, కాలనీల్లో జీ ప్లస్ 5 అనుమతులు తీసుకుని అదనంగా అంతస్తుల చేపడుతారు. దీంతో జీహెచ్‌ఎంసీకి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇదంతా సంబంధిత అధికారులకు తెలిసి కూడా మౌనం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఓయూ అభివృద్ధికి కృషిచేస్తా

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి



ఇంద్రాసేనారెడ్డిని సన్మానిస్తున్న ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: త్రిపుర గవర్నర్, ఓయూ పూర్వ విద్యార్థి నల్లు ఇంద్రాసేనారెడ్డిని యూనివర్సిటీలో ఘనంగా సన్మానించారు. ఆదివారం ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో వీసీ ప్రొ.రవీందర్ అధ్యక్షత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉస్మానియా ఫౌండేషన్, ఓయూ పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఇంద్రాసేనారెడ్డిని సన్మానించి ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఓయూ అభివృద్ధికి తన వంతు సహకారం చేయనున్నట్లు ఈ సందర్భంగా ఇంద్రాసేన రెడ్డి పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, విశ్రాంత అధ్యాపకులు ప్రొ.రమేష్‌రెడ్డి, డా.విజయ్, శ్యాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో అమీర్‌పేట వాసవీక్లబ్ ఆధ్వర్యంలో శ్రీవల్లభ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణతంతును జరిపించారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై వీక్షించి తరించారు. మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు జరిపారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, సుబ్బారావు, నిర్వాహకులు శ్రీనివాస్‌గుప్తా, ప్రవీణ బాలాజీ, భాస్కర్ ఉన్నారు.

అద్వాణీకి 'భారతరత్న'పై సంబురాలు



స్వీట్లు పంచుతున్న బీజేపీ నాయకులు

సనత్‌నగర్: మాజీ ఉప ప్రధాని అద్వాణీకి భారతరత్న ప్రకటించడం పట్ల సనత్‌నగర్‌కు చెందిన బీజేపీ శ్రేణులు సంబరాలు జరిపారు. ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల మహేష్ ఆధ్వర్యంలో బీకేగూడలో స్వీట్లు పంచిపెట్టారు. అద్వాణీ దేశానికి చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను ప్రకటించడం యావత్ దేశం ఆనందంతో ఉప్పొంగిపోతుందని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి నర్సింగరావు, హృషీకేశవ, సుమన్, శివ, రమేష్, లక్ష్మణ్, నాగార్జున, ప్రియా పాల్గొన్నారు.

జియోఫిజిక్స్‌తో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న వీసీ ప్రొ.రవీందర్

ఉస్మానియా యూనివర్సిటీ: జియో ఫిజిక్స్ కోర్సుతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఓయూ వీసీ ప్రొ.రవీందర్ అన్నారు. ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీలో దివంగత ప్రొఫెసర్ బీవీఎస్ మూర్తి గోల్డ్ మెడల్ ఫర్ అకాడమిక్ ఎక్సలెన్స్ ఆఫ్ జియోఫిజిక్స్ కార్యక్రమంలో భాగంగా మోడ్రన్ ట్రెండ్స్ ఇన్ గ్రావిటీ అండ్ మ్యాగ్నెటిక్ మెథడ్స్ అనే అంశం పై వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమానికి సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య అధ్యక్షత వహించగా వీసీ రవీందర్, దివంగత బీవీఎస్ మూర్తి సతీమణి డాక్టర్ సుమన్‌లత, సైన్స్ డీన్ ప్రొ.కరుణసాగర్, జీఎస్ఐ డైరెక్టర్ వి.రాంమూర్తి, డా.ఉదయ్ లక్ష్మీ పాల్గొని ప్రసంగించారు.

కోదండరామ్‌కు సన్మానం



కోదండరామ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ జనసమితి అధినేత, ప్రొ.కోదండరామ్ అందరివాడని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్, కామర్స్ అధ్యాపకులు డాక్టర్ రామేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం కోదండరామ్ నివాసంలో ఆయనను ఓయూ అధ్యాపకులు, విద్యార్థి నేతలు సన్మానించి సమాజంలో అన్ని వర్గాల వారికి చేస్తున్న సేవలను కొనియాడారు. భువనగిరి ఎంపీ టికెట్‌ను తనకు ఇప్పించాలని చనగాని దయాకర్‌గౌడ్ బయో డేటాను సమర్పించగా, ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని డాక్టర్ రామేశ్వర్‌రావు వినతి పత్రం సమర్పించారు. ఈ నెల 13న ఓయూ ఆర్ట్స్ కాలేజీలో కోదండరామ్‌ను ఘనంగా సన్మానించనున్నట్లు పేర్కొన్నారు.

రెడీమిక్స్ లారీ బీభత్సం



చిలకలగూడ: సికింద్రాబాద్ తార్నాకలోని ప్రధాన రహదారిపై మెట్టుగూడ రైల్వే ఆఫీసర్స్ క్లబ్ వద్ద ఆదివారం ఉదయం రెడీ మిక్స్ లారీ బీభత్సం సృష్టించింది. డ్రైవర్ నిర్లక్ష్యంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు, లా అర్డర్ అడ్మిన్ ఎస్ఐ బాలరాజు వివరాల ప్రకారం..నాచారం నుంచి హైటెక్ సిటీకి వెళ్తున్న రెడీమిక్స్ లారీ ఆదివారం ఉదయం 5.30 సమయంలో మెట్టుగూడ ప్రధాన రహదారి పిల్లర్ నంబరు 1076 వద్ద అదుపు తప్పి మెట్రోరైల్ డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. భారీ శబ్దం రావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వాహనంలో ఉన్న మిక్సింగ్ చేసిన సిమెంట్ అంతా రహదారిపై పడటంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. చిలకలగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో క్రేన్ సాయంతో రెడీమిక్స్ అక్కడి నుంచి తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మెట్రోరైల్ డివైడర్ మెయింటెనెన్స్ సబ్‌లీజ్ దారు అతిక్ ప్రమోషన్స్ సంస్థ ఆపరేషన్స్ మేనేజర్ నరేంద్రకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, పరారీలో ఉన్న డ్రైవర్ సంతోష్‌కుమార్ కోసం గాలిస్తున్నామని అడ్మిన్ ఎస్ఐ బాలరాజు తెలిపారు.